విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 19, ఏప్రిల్ 2025

మరమ్మత్తులకు మోక్షమెన్నడో

- చెరువుల్లో తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం
- శిథిలావస్థలో పంట కాలువలు
- ఆయకట్టుకు అందని నీళ్లు
- ఆందోళనలో రైతన్నలు

విశాలాంధ్ర - చాగలమర్రి: ఒకప్పటి ఊట చెరువులు ఒట్టి చెరువులుగా మారుతున్నాయి. నీటి వనరులు తక్కువగా ఉండే ప్రాంతాల్లో చెరువుల మీద ఆధారపడి వ్యవసాయం సాగేది. అయితే రాను రాను చెరువుల్లో నీటి నిల్వ తగ్గిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువుల్లో పూడిక పెరగడం, తూములు, పంట కాలువలు, మట్టి కట్టలు బలహీనంగా ఉండటంతో ఆశించిన మేర పంట పొలాలకు నీరందడం లేదు. ఆళ్లగడ్డ మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో 26 చెరువులు ఉన్నాయి. చాగలమర్రి మండలంలో డి. వనిపెంట, ముత్యాలపాడు, చింతలచెరువు, తోడెండ్లపల్లెలో చెరువులు ఉన్నాయి. చింతల చెరువు కింద 250 ఎకరాలు, ముత్యాల పాడు చెరువు కింద ఖరీఫ్‌లో 550 ఎకరాలు, రబీలో 270 ఎకరాలు, డి.వనిపెంట చెరువు కింద ఖరీఫ్‌లో 900 ఎకరాలు, రబీలో 400 ఎకరాలు, తోడెండ్లపల్లె చెరువు కింద 100 ఎకరాలు, తిప్పనపల్లె చెరువు కింద 600 ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. చెరువులకు మంజూరయ్యే నిధులతో తాత్కాలిక పనులు చేపట్టి అధికారులు, కాంట్రాక్టర్లు చేతులు దులుపు కుంటున్నారు. తోడెండ్లపల్లె గ్రామంలోని చెరువు పూర్తిగా ఆక్రమణకు గురైంది. చెరువులో నీరు లేకపోవడంతో బోర్ల పైనే ఆధారపడాల్సి వస్తోంది. ఆయా చెరువుల్లో రబ్బరు చెట్లు, పూడిక పెరిగిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది.

శిథిలావస్థలో పంట కాలువలు : మండలంలోని చెరువుల ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే పంట కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పంట కాలువల డిస్ట్రిబ్యూటర్లు దెబ్బతిన్నాయి. ముత్యాలపాడు, డి. వనిపెంట, చింతలచెరువు, తిప్పన పల్లె చెరువుల ద్వారా నీరందించే పంట కాలువలు పూడిపోవడంతో చెరువుల ద్వారా చివరి ఆయకట్టుకు చుక్కనీరందడం లేదు. వర్షాకాలంలో చెరువులకు నీరు నింపుతున్న పంట కాలువలు లేకపోవడంతో ఆయకట్టుకు నీరందడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి చెరువుల మరమ్మ తులు, పంట కాలువల పనులు చేపట్టి ఆయక ట్టుకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పనులుచేపట్టాలి - వీరయ్య, రైతు, డి.వనిపెంట: వర్షాకాలంలో చెరువులు నిండుతున్నా ఆయకట్టుకు నీరందదు. చెరువుల్లో నుంచి పంట పొలాలకు అందించే కాల్వలు దెబ్బ తిన్నాయి. ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. పంట కాలువ పనులు చేపట్టి నీరందేలా చూడాలి.

నామమాత్రంగా మరమ్మతులు - బాబునాయుడు, రైతు, డి.వనిపెంట : చెరువుల్లో మరమ్మతులు చేపట్టక పోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నేడు మూడవ శనివారం సందర్భంగా నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మండల స్పెషల్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ పటిష్ట అమలుపై జిల్లాధికారులు, సంబంధిత మండల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయడంతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మె ల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులు అందరినీ ఆహ్వానించి పాల్గొ నేలా చూడాలని ఎంపీడీవోలు తాహిల్దరులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శులు సైతం స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటు న్నారని, ఈ మేరకు జిల్లాలో అందరినీ భాగస్వాములు చేసి స్వచ్ఛ అమలుపై ఆర్డీవోలు, డిఎల్డిఓలు, డిఎల్పిఓలు, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, మున్సిపల్ కమిషనర్లు, సిడిపి వోలు, మండల మెడికల్ ఆఫీసర్స్, ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పారిశుద్ధ కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొనేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్ అంశంతో పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహిం చాలని ప్రభుత్వం సూచించిందని, ఈ మేరకు అన్ని కార్యాల యాల్లో పాడైపోయిన కీబోర్డు, మౌస్, మానిటర్స్, సిపియు, యుపిఎస్, స్టెబిలైజర్ ఇతర కంప్యూటర్ పరికరాల జాబితాను తయారుచేసి ఆర్ఆర్ఆర్ సెంటర్లకు తరలించి సంబంధిత జాబితాపై రసీదు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

విశాలాంధ్ర - డోన్ రూరల్: శుక్రవారం విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురింపబడిన పొంచి ఉన్న ప్రమాదం శీర్షికన విద్యుత్ ఉద్యోగులు స్పందించి విద్యుత్ తీగల పైన విరిగిపడిన కొమ్మను తొలగించారు. త్వరితగతిన స్పందించిన విద్యుత్ ఉద్యోగులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పిన్నాపురం గ్రీన్‌కో దేశానికే తలమానికం : కేంద్ర మంత్రి

విశాలాంధ్ర - పాణ్యం: కేంద్ర నూతన పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ప్రజాపంపిణీ, శ్రీ ప్రహ్లాద్ జోషి, శుక్రవారం పిన్నాపురంలో గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్‌ను సందర్శించి,దాని స్థాయి, వేగవంతమైన పురోగతిని ప్రశంసించారు. ఈ మార్గదర్శక, ప్రపంచ-మొదటి, అతిపెద్ద జిడబ్ల్యు-స్కేల్ ఇంటిగ్రేటెడ్ రెన్యూ వబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్‌లో 4 వేల మెగా వాట్స్ సోలార్, వెయ్యి మెగా వాట్స్ గాలి, 1,680 మెగా వాట్స్ పంప్ చేయబడిన జలవిద్యుత్ ఉత్పత్తి ఉన్నాయి. ఒకే చక్రంలో రోజుకు 10,080 మెగా వాట్స్ అవర్ నిల్వ సామర్థ్యంతో, ప్రాజెక్ట్ నుండి ఉత్పత్తి చేయబడిన పంపదగిన, కార్బన్ రహిత శక్తి గ్రీన్ స్టీల్,గ్రీన్ అల్యూమినియం, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి వంటి పరిశ్రమలకు మద్దతు ఇస్తుంది. కేంద్ర మంత్రి ఈ సదుపాయాన్ని ఏరియల్ టూర్ చేశారు. మెగా ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్‌లోని వివిధ భాగాలను సందర్శించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపం చంలోనే మొట్టమొదటి అతిపెద్దదైన పిన్నాపురంలో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ స్టోరేజీ ప్రాజెక్ట్‌ను అమలు చేయడం మన దేశంలో గర్వించదగిన విషయమని, భారతదేశానికి గర్వకారణమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ప్రగతికి ఆదర్శంగా నిలుస్తున్నద''న్నారు. మంత్రి పర్యటనకు స్వాగతం పలుకుతూ, కృతజ్ఞతలు తెలుపుతూ గ్రీన్కో గ్రూప్ ఎండి అనిల్ చల మలశెట్టి ప్రాజెక్ట్ ముఖ్య లక్షణాలు, ప్రయోజనాలను ప్రదర్శించే వివరణాత్మక పర్యటనకు నాయకత్వం వహించారు. ఈ ప్రాజెక్ట్ ఏటా 3.3 మిలియన్ టన్నుల కార్బన్డయాక్సైడ్ ఉద్గారాలను నివారించడంలో సహాయపడుతుందని ఆయన నొక్కి చెప్పారు. క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి, నిల్వ ఆన్-డిమాండ్ సరఫరా కోసం రూపొందించబడిన ఈ ప్రాజెక్ట్ దేశ ఇంధన భద్రతను పెంపొందించడంలో హరిత వనరులకు దాని పరివర్తనను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కర్నూలు ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు టిజి వెంకటేష్, పాణ్యం తహసిల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులు నాయుడు, మహేష్, కిరణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

భారీ ఈదురుగాలతో కురిసిన వర్షం

విశాలాంధ్ర -బనగానపల్లె: మండలంలోని బనగానపల్లె - పసుపుల రహదారిలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీనితో చిన్నారాజుపాలెం నుంచి పెద్దరాజుపాలెం వరకు ఆర్ అండ్ బీ రహదారి పక్కన ఉన్న భారీ వృక్షాలు నేలకులాయి. దీంతో సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వర్షాల కారణంగా ఆరుబయట పొలాల్లో విక్రయాలకు సిద్ధంగా ఉంచిన మొక్కజొన్న ధాన్యం దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చినరాజుపాలెం తండాలో మద్దిలేటి నాయక్ చెందిన మామిడి తోటలో మామిడి చెట్లు నేలకోరిగాయి. కాగా వర్షం వేలిసిన వెంటనే సమీప గ్రామస్తులు రహదారికి అడ్డంగా ఉన్న చెట్లకొమ్మలు నరికి దారి సుగమం చేయటంతో రాకపోకలకు ఇబ్బంది తొలగింది.

రైతుల సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వం

విశాలాంధ్ర - వెలుగోడు : రైతుల సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వం ధ్యేయం అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రేగడగూడూరు గ్రామంలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ రబీలో పండించిన జొన్నలకు సరైన మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గ్రహించి జిల్లాకు చెందిన మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బిసి జనార్ధన్ రెడ్డి, జిల్లా శాసన సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెం నాయుడు లను కలిసి జొన్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దత్తు ధరను పెంచాలన్నారు. క్వింటాల్‌కు రూ.3,371 పెంచి కొనుగోలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి సివిల్ సప్లైస్ డిఎం రాజు, ఏఓ పవన్, డీసీఎంఎస్ నవీన్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, వివిధ గ్రామ, మండల నాయకులు శేషిరెడ్డి, వంగాల కృష్ణారెడ్డి, అంబాల రామకృష్ణారెడ్డి రామసుబ్బారెడ్డి, దేశం నారాయణరెడ్డి తదితరులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆటోల సౌకర్యం కల్పించాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-డోన్ : గుంటూరు వెళ్లే ప్యాసింజర్ రైలు 1వ నెంబర్ ఫ్లాట్ ఫామ్ నుండి బయలుదేరేలా చూడాలని, రైల్వే స్టేషన్లో ఆటోల సౌకర్యం కల్పించాలని ఏఐవైఎఫ్ నాయకులు అన్నారు. శుక్రవారం డోన్ రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లుకు ఏఐవైఎఫ్ డోన్ మండల సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, కార్యదర్శులు హరి కృష్ణ, జి.పృథ్వీ కుమార్‌లు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 6:30 డోన్ నుంచి గుంటూరు వెళ్ళే ఎక్స్ప్రెస్ రైలు నాలుగో ఫ్లాట్ ఫామ్ నుండి ప్రారంభమవుతుందని, ఐదో నెంబర్ లో గూడ్స్ రైలు ఆగి ఉండడం ద్వారా నాలుగో నెంబరు ఫ్లాట్ ఫామ్ పోవాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతిరోజు రాత్రి ఈ రైలు డోన్ రైల్వే స్టేషన్‌కి చేరుకుంటుందని, ఉదయం ఒకటో నెంబర్ లేదా 2వ నెంబర్‌కి లేదా 5 నెంబర్ నుండే ఆ రైల్ని ఆ ఫ్లాట్ ఫామ్‌లో ఉంచి ప్రారంభం అయ్యే విధంగా చూడాలని కోరారు. ఈ ప్యాసింజర్ రైలు ఎక్స్‌ప్రెస్‌గా మార్చి టికెట్ పెంచారు. ప్రతి స్టేషన్‌లో ఆగుతుందన్నారు. కావున టికెట్ ధర కూడా తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. డోన్ రైల్వే స్టేషన్ జంక్షన్ పాయింట్‌గా ఆటో బెంగళూరు ఇటు తిరుపతి ఇటు కాచిగూడ వెళ్ళు ప్రయాణికులకు ముఖ్యమైన సెంటర్ పాయింట్‌గా ఉందని, వృద్ధులు, స్త్రీలు పిల్లలతో రైళ్లలో ప్రయాణిస్తారన్నారు. గుంతకల్, కాచిగూడ రైల్వే స్టేషన్ల మాదిరే ఫ్లాట్ఫామ్ ఆటోలు ఏర్పాటు చేసి ప్రజల అవసరం తీర్చాలని కోరారు. డోన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రాఘవేంద్ర ఈశ్వర్, రాజు పాల్గొన్నారు

కోవెలకుంట్లలో వడగండ్ల వర్షం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్లతో కూడిన భారీ వర్షం పడింది దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు ఈ వర్షంతో కాస్త ఊరటం కలిగించింది. మిరప, మొక్కజొన్న కలాల్లో ఉండడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

అహోబిలేశుని దర్శించుకున్న కేంద్రమంత్రి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శుక్రవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హెలిప్యాడ్ వద్ద జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, దేవస్థానం వేద పండితుల బృందం ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాలలో లక్ష్మీనరసింహస్వామి వారికి, అమృత వల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగమంటపంలో వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం పలికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, సిఐ మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అహోబిలం దేవస్థానం మేనేజర్ మాధవన్, ప్రధాన అర్చకులు వేణు గోపాలన్, రంగరాజన్, సేతురామన్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

విశాలాంధ్ర - శిరివెళ్ల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని శిరివెళ్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నాయక్ మహమ్మద్ వసీం అన్నారు. మండల కేంద్రంలోని నూరాణి మసీద్ ప్రాంగణంలో పలువురు ముస్లిం మైనార్టీ నేతలు ప్రముకులతో కలిసి ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమాన్ని విస్మరించి వ్యతిరేక చర్యలు చేపట్టడం అన్యాయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ముస్లింల స్వేచ్ఛను హరించేలా వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించినదని వెంటనే చట్టాన్ని రద్దు చేసి సంక్షేమానికి పెద్దపీటవేయాలన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సవరణ చట్టానికి వ్యతిరేకంగా వేసిన పిటిషన్ ను స్వీకరించడం హర్షించదగ్గ విషయమన్నారు.

సేఫ్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల పట్టణంలో అర్ధరాత్రి వేళ జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో నైట్ బీట్‌లను, పోలీసుల పనితీరును ఆయ పరిశీలించారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, నేర నివారణే లక్ష్యంగా అందరూ పనిచెయ్యాలని పోలీసులను ఆదేశించారు. నంద్యాలను సేఫ్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, రాత్రి పెట్రోలింగ్, గస్తీని పటిష్టం చెయ్యాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరగకూడదని యువతకు హెచ్చరించారు. రాత్రి గస్తీలలో సిబ్బంది వారి స్టేషన్ పరిదిలోని నేర చరిత్ర గల వారిపై, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలని, అనుమానితుల వివరాలు వారి అడ్రస్ ఫోన్ నంబర్స్‌తో సహా బీట్ బుక్‌లలో పొందుపరచాలన్నారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా టెంట్లు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - పాములపాడు : ఉపాధి కూలీలకు పని ప్రదేశాలలో వడదెబ్బ తగలకుండా టెంట్లు ఏర్పాటు చేసి పెండింగ్ బిల్లును తక్షణమే చెల్లించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో ఎస్సీ, ఎస్టీలు పని చేస్తున్న ఉపాధి పని ప్రదేశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశాల్లో టెంటు లేక చుట్టుపక్కల ఉన్న చెట్ల కొమ్మలను నీడగా ఉపయోగించుకొని పని చేస్తున్నారని అన్నారు. తక్షణమే అధికారులు వడదెబ్బ నుండి ఉపాధి కూలీలను కాపాడాలని, ప్రతి గ్రూపుకు టెంట్లు ఏర్పాటు చేసి కాపాడాలన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, పని చేసే చోట కూలీలకు వడదెబ్బ నుండి రక్షణ పొందినందుకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని, మెడికల్ కిట్లు అందుబాటులో పెట్టాలని డిమాండ్ చేశారు.

స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో మంత్రి బీసీ

విశాలాంధ్ర - బనగానపల్లె: నేడు శనివారం పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హాజరవుతున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. అధికారులు, వార్డ్ నెంబర్లు, హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

మట్టి వినాయకుని విగ్రహాలు నెలకొల్పుదాం

విశాలాంధ్ర - బనగానపల్లె : పర్యావరణ పరిరక్షణ కోసం రాబోయే వినాయక చవితి నాడు వినాయక మండపాల్లో మట్టి వినాయకుని విగ్రహాలు నెలకొల్పుదామని బిసి ఇందిరా రెడ్డి కోరారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ నివాసంలో వినాయక కేంద్ర కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, టంగుటూరి సీనయ్య, నాగరాజు, నాగేష్, శేఖర్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో ప్లాస్టిక్ నిషేధించిన తాడిపత్రి పట్టణం తరువాత బనగానపల్లె పట్టణం స్థానం సంపాదించిందన్నారు. పట్టణంలోని వినాయకుని మండపాల్లో మట్టి వినాయకుని విగ్రహాలు నెల కొలిపి రాష్ట్రంలో మరొక్కసారి బనగానపల్లె పేరు ను మారు మోగేలా చేద్దామన్నారు. ప్రసాద్, రాజేష్, జక్కా శ్రావన్, గుండా మురళి, సాయిరాం, నిలి పుల్లన్న రామసుబ్బయ్య, శంకర్, సుధాకర్, ఒడిసెల వనింద్ర నూకల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

సర్వ మానవాళి రక్షణార్థమే క్రీస్తు సిలువ మరణం

విశాలాంధ్ర - రుద్రవరం: లేఖనాల నెరవేర్పులో భాగంగా సర్వ మానవాళి రక్షణార్థమై క్రీస్తు సిలువలో మృతి చెందడం జరిగిందని రెవరెండ్ సురేష్ బాబు అన్నారు. శుభ శుక్రవారం సందర్భంగా పేరూరు, కోటకొండ, పెద్ద కంబలూరు, చిన్న కంబలూరు, బీరవోలు, నరసాపురం, తిమ్మనపల్లి పలు గ్రామాల్లో ఉన్న చర్చిల లో క్రైస్తవులు యేసు క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటల విశిష్టతను పాస్టర్లు బోధించారు. మండల కేంద్రంలోని సిఎస్ఐ చర్చి పాస్టర్లు సురేష్ బాబు, పరకటి జాన్ లు బోధిస్తూ తండ్రి చిత్తానుసారం ఏసుక్రీస్తు మానవాళి రక్షణార్థమై ఆయన ఎన్నో శ్రమలను భరిస్తూ మన పాపముల నిమిత్తమై ఆయన సిలువ మ్రానుపై వేలాడి తన రక్తాన్ని కార్చి, లేఖనాల నెరవేర్పులో భాగంగా ఆయన మృతి చెందడం జరిగిందని బోధించారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కండి : సీపీఐ

విశాలాంధ్ర - జూపాడు బంగ్లా మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు కోరారు. మండల ప్రజా సమస్యల పరిష్కారానికి త్వరలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నామని ఇళ్ల స్థలాలు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని సిద్దేశ్వరం గ్రామంలో సిపిఐ శాఖ సమావేశం నరసింహ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. 37

నిందితులు అరెస్టు, రిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ సుధాకర్ రెడ్డి విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా హరిజనపేట వైపుగల మద్దిలేరు వాగు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా అటు ఇటు తిరుగుతుండగా వారిని పట్టుకుని తనిఖీ చేయగా ఒక్కొక్కరి వద్ద 10 లీటర్ల నాటు సారాయితో పాటు వారి చేతిలో పెద్ద కత్తులు ఉండడం గమనించి వాటిని స్వాధీనంలోనికి తీసుకొని రిమాండ్ చేశారు. హరిజన పేటకు చెందిన కొముపాలెం బద్రి, నందమూరి నగర్ కు చెందిన ఇమ్మానియేల్ అలియాస్ పొట్టి, వీరిపైన కొన్ని పాత కేసులు కూడా ఉన్నాయని సీఐ తెలిపారు. సీఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రౌడీషీటర్ల పైన, నేర చరిత్ర గల వారి పైన వారి కదలికలపైన నిఘా ఉంచడం జరుగుతుందని, ఎవరైనా గంజాయి, నాటు సారాయి, జూదం, క్రికెట్ బెట్టింగ్ తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్ప డితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర గల వారు సమాజంలో మంచి పౌరులుగా జీవించాలన్నారు. పోలీస్ వారి మాటలను బేఖాతరు చేసి శాంతి భద్రతలకు భంగం వాటిల్లేలా లేదా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రద్దయ్యేంత వరకు ముస్లింలు పోరాడాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ముస్లిం సమాజానికి తీవ్ర నష్టం జరిగే వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు కాకుండా ప్రతి ఒక్కరు ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని, పూర్తిగా రద్దయ్యేవరకు ఉద్యమించాలని జిల్లా వైసీపీ మైనార్టీ నేతలు, ఇంటలెక్చువల్ వింగ్ డిస్ట్రిక్ట్ ప్రసిడెంట్ రసూల్ ఆజాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బాష, మౌలానా ఇంతియాజ్ అహ్మద్, షఫీ, హఫీజ్ అబ్దుల్ గఫూర్‌లు పిలుపునిచ్చారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కేంద్రంలోని ఉభయ సభలలో ముస్లిం సమాజానికి తీవ్ర నష్టం కలిగించే వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెడితే, అందుకు మద్దతుగా కూటమి ప్రభుత్వం మద్దతు పలకడం ముస్లిం సమాజానికి తీరని ద్రోహం చేయడమేనన్నారు. ముస్లింల ఓట్లతో అధికారం చేపట్టిన చంద్రబాబు తమను మోసం చేశారని, ముస్లింల శ్రేయస్సు కొరకు అల్లాపేరున దాతలు ఇచ్చిన భూములను కొల్లగొట్టేందుకు నల్లచట్టాలను అమలు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, ఇది అన్యాయమన్నారు. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా తమ నేతలు రెండు సభలలో వ్యతిరేక ఓటు వేశారని వారికి ధన్యవాదాలు తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేసేంత వరకు పోరాడాలని వారు పిలుపునిచ్చారు.

నాడు ఘనం.. నేడు శిథిలం..

- రాజకీయ నాయకుల మాటలు నీటి మీద రాతలే
- ఎక్సైజ్, తూనికలు కొలతలు, నీటి పారుదల, ఉద్యాన శాఖలకు లేని సొంత భవనాలు
- లక్షల్లో అద్దెలు చెల్లిస్తున్న టౌన్ సచివాలయాలు

విశాలాంధ్ర - డోన్ రూరల్: ఇచ్చటనే ఎంతో మంది జన్మించారు. ఇచ్చోటనే మరి ఎంతోమంది మరణించారు. ఈ ప్రాంగణం లోనే ఎందరో ప్రమాదాలకుగురై ఇదే వైద్య శాలలో చికిత్స పొంది పునర్జన్మ పొందారు. ఇలాంటి ఘనమైన సేవలందించిన పాత పేట లోని ప్రభుత్వ వైద్యశాల నేడు శిథిలావస్థకు చేరుకుంది. సు విశాలమైన ప్రదేశంలో ఉన్నా కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఇక్కడ ఉన్న భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతున్నాయి. ఇనుప కిటికీలు, తలుపులు అక్రమార్కుల చోరీకి గురవుతున్నాయి. ఈ భవనాలు ఎలాంటి వాడకం లేకపోవడం వలన భవనాల పై చెట్లు పెరగడంతో శిథిలావస్థకు చేరుకుని నాడు కళకళలాడిన భవనాలే నేడు వెలవెలబోతు న్నాయి.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు: ప్రభుత్వ కార్యాలయాలైన హార్టికల్చర్, ఎక్సైజ్, మైనర్ ఇరిగేషన్, తూనికలు, కొలతలు, సచివాలయాలు వంటి ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వం లక్షలలో అద్దెలు చెల్లిస్తూ కాలం వెల్లదీస్తుంది.వ్యవసాయ, గృహ నిర్మాణ ఆఫీసులు ఇరుకు గదుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ పూర్వ వైద్యశాల లోని గదులు ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయిస్తే ప్రభుత్వానికి ఖర్చు మిగులుతుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. నిర్వీర్యం చెందిన పాతపేట లాంటి ప్రాంతాలకు మునుపటి వైభవం వస్తుందని పలువురు సూచిస్తు న్నారు. ఎన్నికలప్పుడు రాజకీయ నాయకులు ఇచ్చిన వాగ్దానాలు నీటి మీద రాత లేనా అని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా నాయకులు జోక్యం చేసుకొని, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా ఉన్న పాత ఆసుపత్రికి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచి శిథిలమవుతున్న భవనాలను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

నామినేటెడ్ పోస్టుల కోసం తమ్ముళ్ళ చూపు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత ఐదేళ్ల నుండి పదవులు లేక ఉన్న చాలా మంది సీనియర్ నాయకులు, ద్వితీయశ్రేణి నేతలు నామినేటెడ్ పోస్టు అయినా రాకపో తుందా అని ఎదురుచూ స్తున్నారు. పార్టీ అధినేత జిల్లాలో మొదటి విడతగా కుడా చైర్మెన్, బోయవాల్మీకి కార్పొరేషన్ చైర్మెన్, కురవ కార్పొరేషన్ డైరెక్టర్ నియామకాలు, పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మెన్ నియామకాలు, ఎమ్మెల్సీ మాత్రమే పూర్తి చేశారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు తదితర మార్కెట్‌యార్డు చైర్మెన్ పోస్టులతో పాటు కొన్ని కులాలకు సంబంధించిన కార్పొరేషన్ చైర్మెన్ నియామకాలు, కేడీసీసీ చైర్మెన్ పదవులు భర్తీ చేయవలసి ఉంది. దీనికి తోడు మరికొన్ని నామినేషన్ పదవులు భర్తీ చేయవలసి ఉంది. ఇందు కోసం జిల్లాలో టీడీపీ సీనియర్ నాయకులు మీనాక్షినాయుడు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, తిక్కారెడ్డి, తుగ్గలి నాగేంద్ర, సాంబశివారెడ్డి, ఆకేపోగు ప్రభాకర్, గుడిసె క్రిష్ణమ్మతో పాటు చాలా మంది నేతలు నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారు. పోస్టుల భర్తీలో ఆలస్యం అవుతుం డటంతో ఆశావహుల సంఖ్య పెరుగుతూ పోతుంది. గత ఎన్నికలలో సీట్లు త్యాగం చేసిన వారు, సీట్లు ఆశించి భంగ పడ్డ నేతలు నామినేటెడ్ పోస్టు అయినా దక్కక పోతుందా అంటు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పార్టీ అధిష్టానంకు అటుపార్టీ అగ్రనేత, ఇటు యువనేత నారాలోకేష్ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. అదిష్టానంను ప్రసన్నం చేసుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నట్లు తెలుస్తుంది.

ప్రపంచ స్థాయిలోఎనర్జీ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు గ్రీన్‌కో

విశాలాంధ్ర - ఓర్వ కల్లు: ప్రపంచస్థాయిలో ప్రతిష్ఠాత్మ కమైన ప్రాజెక్టు గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ అని కేంద్ర కన్స్యూమర్స్ అఫైర్స్, ఫుడ్ మరియూ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, న్యూ, మరియూ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. శుక్రవారం ఓర్వకల్లు మండలం గని సమీపంలో ఉన్న సోలార్ పార్క్, గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్, విండ్ పవర్ ప్రాజెక్ట్ లను హెలికాప్టర్ ద్వారా మంత్రి పరిశీలించారు. అనంతరం అప్పర్ ఇన్ టేక్ పాయింట్ రిజర్వాయర్ నుండి నీటిని పైపుల ద్వారా టర్బైన్‌ల వరకు సరఫరా చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్ట్ యొక్క వేగవంతమైన పురోగతిని ప్రశంసించారు. ప్రపంచంలోనే మొట్టమొదటి, అతిపెద్ద రకమైన ప్రాజెక్ట్ గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ మన దేశంలో ఉండడం గర్వకారణం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనిక నాయకత్వంలో భారతదేశం గ్రీన్ ఎనర్జీ సామర్థ్యానికి ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ అన్నారు. ఈ మార్గదర్శక ప్రయత్నాన్ని సాధ్యం చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నా న్నారు. గ్రీన్ కో సంస్థ ఎండి చలమలశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత, ఈ ప్రాంతంలో ఆర్థిక వృద్ధిని పెంచుతుందని, అనుబంధ పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తుందన్నారు. ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు. స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి, నిల్వ, డిమాండ్‌పై సరఫరా కోసం రూపొందించబడిన ఈ ప్రాజెక్ట్ భారతదేశ ఇంధన భద్రతను పెంచడంలో, పర్యావరణ అనుకూల వనరులకు పరివర్తనను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రీన్ కో సంస్థ ఎండి చలమలశెట్టి అనిల్ కుమార్, కర్నూలు బీజేపీ జిల్లా ఇన్చార్జి అంకాల రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఎర్ర మట్టి దందా

- గత ఐదు రోజులుగా రోజుకు ఐదు ట్రాక్టర్లతో ఎర్రమట్టి తరలింపు
- ఒక్కో ట్రిప్పు ఎర్రమట్టి రూ.1500 నుండి రూ.3 వేలు
- చూసి చూడనట్లు వ్యవహరిస్తూ రెవెన్యూ, పోలీస్ శాఖ
- లక్షల్లో ప్రభుత్వ ఆదాయనికి గండి

విశాలాంధ్ర - నందవరం: మాచాపురం గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు యదేచ్ఛగా ఎర్రమట్టి దందా చేస్తున్నారు. గ్రామంలోని వ్యక్తులకు ఒక్కో ట్రిప్పు రూ.1500 నుండి రూ.3 వేల మధ్యలో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనలు మేరకు ఎలాంటి అనుమతులు లేకపోయినా యదేచ్ఛగా అక్రమంగా ఎర్ర మట్టి దండ చేయడంతో ప్రైవేట్ వ్యక్తులు లక్షల్లో లాభపడుతున్నారు. ఒక ట్రిపుకు రూ. వెయ్యి నుండి రూ. 2వేల మధ్యన మిగులు అవుతుందని, రోజుకు ఒక్కో ట్రాక్టర్ 15 ట్రిప్పులు ఎర్రమట్టి తరలించి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఒకే చోట భారీగా ఎర్రమట్టిని తరలిస్తుండడంతో భారీగా గుంతలు ఏర్పడి వర్షా కాలంలో ఆ గుం తలు నీళ్లతో నిండి, ఎవరైనా ప్రజలు నీళ్ల కోసం వెళితే ప్రమాదవశాత్తు గుంతల్లో పడి మర ణించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు అంటు న్నారు. గత ఐదు రోజులుగా ప్రభుత్వ భూమిలో ఎర్ర మట్టి తరలిస్తున్న సమా చారాన్ని కొంతమంది గ్రామస్తులు రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారు లకు సమా చారం అందిం చిన వారి నుండి ఎలాంటి స్పంద న రావడంలేదని, ముడు పులు ఇచ్చినందుకే వారు స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపి స్తూన్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ వ్యక్తులపై రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు చర్యలు తీసుకుని ఎర్రమట్టి తరలింపును ఆపివేస్తారా లేక ప్రజలు అంటున్నట్లు ముడుపులు ఇచ్చారు కదా అని వదిలేస్తారా.. వేచి చూడాలి మరి.

సీహెచ్‌వోల పరిష్కరణకై ఆందోళనలు

విశాలాంధ్ర-తుగ్గలి: గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా తుగ్గలి మండలంలో పనిచేస్తున్న సిహెచ్‌ఓలు ఆసుపత్రి ఎదుట శుక్రవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తూ మాతా శిశు సంరక్షణ కోసం నిత్యం పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిం చాలన్నారు. గత ఆరేళ్ల నుండి తాము గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తూ ఉన్నామన్నారు. ఇంతవరకు తమ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ముఖ్యంగా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా మాకు 23 శాతం వేతన సవరణ చేయాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహాలు అందిం చాలన్నారు. ఈపీఎఫ్‌ను పునర్దించాలన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరితకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓలు స్రవంతి, శిరీష, శివ పార్వతి, శ్వేత, ఉమాదేవి, ఉమెరియా, అంజలి, మల్లిక, షాహీన్, ములేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత కిసాన్ సభ జాతీయ సమితి సభ్యులుగా ఎన్నిక పట్ల హర్షం

విశాలాంధ్ర - కోడుమూరు : అఖిల భారత కిసాన్ సభ జాతీయ సమితి సభ్యులుగా కర్నూలు జిల్లాకు చెందిన పి.రామచంద్రయ్య, కె.జగన్నాథంలు ఎన్నిక కావడం పట్ల సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 15, 16, 17వ తేదీలలో తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో జరిగిన జాతీయ మహాసభలలో నూతన జాతీయ సమితి సభ్యులుగా జిల్లాకు చెందిన రామచంద్రయ్య, జగన్నాథంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కోడుమూరు సీపీఐ నాయకులు కృష్ణ జిల్లాకు చెందిన నాయకులు నూతన జాతీయ సమితి సభ్యులుగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ మాట్లాడుతూ కరువు పరిస్థితులపై జిల్లా అంతటా పర్యటించి,రైతుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, వారి శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేసిన అఖిల భారత కిసాన్ సభ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి జగన్నాథంలు ఏఐకేఎస్ జాతీయ మహాసభలలో జాతీయ సమితి సభ్యులుగా ఎంపిక కావడం సంతోషకరమన్నారు.

ఈ-వ్యర్థాల పునర్వినియోగమే మానవాళికి రక్ష

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: సమాజంలో పర్యావరణానికి ఈ-వ్యర్థాలు తీవ్ర హాని చేస్తున్నా యని, వాటిని పునర్వినియోగించడమే మానవాళి మనుగడకి రక్ష అని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ పొట్టిశ్రీరాములు చిల్డ్రన్స్ పార్కులో పారిశుద్ధ్య విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రోజురోజుకు వినియోగం పెరుగుతూ, సమాజంలో ముంచెత్తుతున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాల వ్యర్థాలను పూర్తిస్థాయిలో పునశ్శుద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ-వ్యర్థాలను భూమిపైన, నీటిలో పడేస్తుండటంతో పర్యావరణానికి, మానవాళికి హాని కలుగుతోందని, వీటిని దహనం చేయడం వల్ల కర్బన ఉద్గారాలు విడుదలై ప్రకృతిపై, జనజీవనంపై దుష్ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ ఈఈ పివి కిషోర్ రెడ్డి, గ్రీన్ గ్లోబల్ రీసైక్లర్స్ ప్రతినిధులు పవన్, అలోక్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తనిఖీదారులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర ర్యాలీ: శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నూతన కౌన్సిల్ హాల్లో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి భరత్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఈ-చెక్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. అనంతరం అక్కడి నుండి అశోక్ నగర్ పంప్ హౌస్ వద్దనున్న ట్రిబుల్ ఆర్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్తారు.

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరి వైసీపీ నాయకులు గుంతా రఘు సోదరుని కుమార్తె రాజేశ్వరి, జొన్నగిరి తాండా మాజీ జడ్పీటీసీ నారాయణ నాయక్ సోదరుడు స్వామి నాయక్ కుమారుని వివాహ వేడుకలలో ఎమ్మెల్సీ మధు సూదన్, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కేడిసిసి మాజీ వైస్ చెర్మెన్ రామచంద్రారెడ్డి, జడ్పీటీసీ పులికొండ నాయక్, మాజీ జడ్పీటీసీ జగన్నాథ్ రెడ్డి,మాజీ ఎంపీపీ ఎర్ర నాగప్పలు పాల్గొని నూతన వదువరులను ఆశీర్వదించారు. ముందుగా నాయకులకు బాణాసంచా, మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదర్య పడవలసిన పనిలేదని రాబోయేది వైసీపీనేనని తెలిపారు. ఈ వేడుకలలో మండల నాయకులు శ్రీనివాస రెడ్డి, భాస్కర్ రెడ్డి, మోహన్ రెడ్డి, జిట్టా నాగేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మా కాలనీలోని మురికి కాలువల దుస్థితి చూడండయ్యా

విశాలాంధ్ర - కోడుమూరు: పట్టణంలోని 20వ వార్డులోని షణ్ముఖ రెడ్డి నగర్ నందు ఉన్న మురికి కాల్వల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, మా కాలనీలోని మురికి కాలువల దుస్థితి చూడండయ్యా అంటూ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ విన్నవించారు. శుక్రవారం కాలనీలోని మురికి కాలువల దుస్థితిపై కాలనీ ప్రజలతో కలిసి సిపిఐ నాయకులు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో గత కొద్ది రోజులుగా మురికి కాలువలు నిండిపోయి, ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతూ కాలనీలోని ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వాపోయారు. కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఇప్పటికే వేసవిలో చాలామంది పట్టణంలోని ప్రజలు అనారోగ్యంతో బాధపడి మృతి చెందారని గుర్తు చేశారు. కాలనీలోని ప్రజలు మురికి కాలువల పరిస్థితిపై చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారని, అయినా కాలువల దుస్థితిపై అధికారుల పర్యవేక్షణ ఏమాత్రం లేదని వారు మండిపడ్డారు. తమ కాలనీలో మురికి కాలువలను శుభ్రం చేసి, సిసి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన గ్రామపంచాయతీ అధికారులను కోరారు. కాలనీ వాసులు కప్పట్రాళ్ల కృష్ణ, కూరగాయల రంగన్న, ట్రాక్టర్ నాగేషు, పింజరి గోకారి,చాకలి బజారి తదితరులున్నారు.

వర్షపు నీరు నిలవకుండా చర్యలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరంలోని అశోక్ నగర్ రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కింద వర్షం పడినప్పుడు నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు తెలి పారు. శుక్రవారం అక్కడ జరుగుతున్న మురుగు కాలువల పునరుద్ధరణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ ఇటీవల వర్షం కురిసినప్పుడు అశోక్ నగర్ రైల్వే బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచి, వాహనదారులు ఇబ్బంది పడుతున్నట్లు రాష్ట్ర పరిశ్ర మలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజి భరత్ దృష్టికి వచ్చిందని, అప్పుడే తక్షణమే తాత్కాలిక పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు 25 మంది ప్రత్యేక సిబ్బందితో చర్యలు చేపట్టామని కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్ష అధికారి నాగరాజు, తనిఖీదారుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

విశాలాంధ్ర-పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నతుంబళం, బసలదొడ్డి, హెచ్.మురవణి, కంబదహాల్, కంబళదిన్నె, జాలవాడి, కల్లుకుంట, పెద్దకడబూరు తదితర గ్రామాలలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలో ఉదయం ఆర్‌సిఎం చర్చి ఫాదర్ సంజీవరావు ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల గుండా సిలువ యాత్ర నిర్వహించారు. అనంతరం ఆయా చర్చీలలో గుడ్ ఫ్రైడే పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు, ఆర్సీఎం చర్చి ఫాదర్ సంజీవ్ రావు గుడ్ ఫ్రైడే సందేశమిచ్చారు. లోక కల్యాణం నిమిత్తం ఏసుక్రీస్తు సిలువలో అనేక శ్రమలకు ఓర్చి మానవాళికి విముక్తి కల్పించారని గుర్తు చేశారు. ఏసుక్రీస్తు సిలువలో వ్రేలాడుతూ పలికిన ఏడు మాటలపై వివరించారు.

వర్షానికి తడిచిన ధాన్యం

విశాలాంధ్ర-హెరాళగుంద: మండలంలోని గజ్జహళ్లిలో శుక్రవారం సాయంత్రం ఆరున్నర గంటలకు ఉరుములు మెరుపుల వర్షం కురిసింది. విపరీతంగా వీచిన ఈదురు గాలులకు చెట్లు కూలి రోడ్లకు అడ్డంగా పడ్డాయి దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఉరుములు మెరుపుల వర్షం వల్ల పొలాల్లో వేసిన వరి ధాన్యాలు, ఎండుమిర్చి, తడిచి ముద్దవవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. తడిచిన ధాన్యాలను వ్యాపారస్తులు ఎవ్వరు కొనుగోలు చేయాలని దీనివల్ల ఆర్థిక నష్టం తప్పదని రైతులు ఆవేదన చెందారు. అసలే గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న తమకు వర్షం వల్ల తీవ్ర ఇబ్బంది కలిగించిందని రైతులు వాపోయారు. భారీ ఈదురుగాలులకు వరి పంట నేల పాలయింది వరి కోతను కొయ్యాలంటే మనుషులను పెట్టి కోరి కోత చేయాలని దీనికి అధిక పెట్టుబడి చెల్లించాల్సి వస్తుందని ఆయకట్టు రైతులు తెలిపారు. ఉక్కు పూతతో అల్లాడుతున్న రైతులకు పడిన వర్షానికి వాతావరణం చల్లబడింది. వర్షానికి తడిచిన ధాన్యాలను అధికారులే కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

ఆదివారం రాజ వర్ధన్ రెడ్డి మూడో వర్ధంతి

విశాలాంధ్ర - సి.బెళగల్: జిల్లా ప్రజా నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి కుమారుడు కర్నూలు మాజీ మండలాధ్యక్షులు కీర్తిశేషులు రాజ వర్ధన్ రెడ్డి మూడవ వర్ధంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఉన్న ఎన్టీఆర్ పార్కులో నిర్వహించడం జరుగుతుందని టిడిపి మాజీ మండల కన్వీనర్ పోలకల్ చిన్న తిమ్మప్ప తెలిపారు. ఆదివారం ఎన్టీఆర్ పార్కులో నిర్వహిస్తున్న డి.రాజవర్ధన్ రెడ్డి వర్ధంతి వేడుకలకు మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్య కర్తలు భారీ సంఖ్యలో పాల్గొని డి.రాజ వర్ధన్ రెడ్డి వర్ధంతి వేడుకలలో పాల్గొని ఆయన ఆత్మకు శాంతి చేకూరేలా నివాళులు అర్పించాలన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు చిన్న తిమ్మప్ప తెలిపారు.

రామరాజ్యమా.. రాక్షస రాజ్యమా..

విశాలాంధ్ర - కౌతాళం: దేశంలో రామరాజ్యం పాలన కాదని రాక్షస రాజ్యం పాలన సాగుతుందని ప్రజాసంఘాలు సీపీఐ, సీపీఐ(ఎం), అవాజ్ కమిటీ, దళిత సమాఖ్య జై భీమ్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మదీనా మజీద్ నుండి దర్గా మీదుగా పాత బస్టాండ్ ద్వారా ప్రధాన రహదారి గుండా బిస్మిల్లా సర్కిల్ వద్ద చేరుకొని మానవహారాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగా అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేవలం మత చిచ్చు పెట్టడానికి, హిందూ ముస్లిం మధ్య వైరుధ్యం పెంచడానికి ముస్లిం వ్యతిరేక చట్టాలను తీసుకువస్తుందని విచారం వ్యక్తం చేశారు. ముస్లిం మేలుకోరి వక్ఫ్ చట్టాన్ని సవరణ చేస్తున్నట్లు అమిత్ షా పార్లమెంటు సాక్షిగా చెప్పడం చాలా బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సవరణ చట్టానికి మద్దతు తెలపడం ఆయన వెన్నుపోటుకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా ధర్మాకర్త మున్న సాహెబ్, సర్పంచ్ పాల్ దినాకర్, సిపిఐ మండల కార్యదర్శి ఈరన్న, సిపిఎం డివిజన్ ఉపాధ్యక్షులు మల్లయ్య, జై భీమ్ నాయకులు అవతారం, వీరేష్, దళిత సమాఖ్య మండల అధ్యక్షులు విజయకుమార్, ముస్లిం పెద్దలు ఖాజా హుస్సేన్, ముల్లా గౌస్, ఇద్రిస్, దివాన్ సాబ్, బషీర్,హఫీజ్ హుస్సేన్, ఖాసీం ముల్లా, పింజారి ఖాసిం, శక్షావలి తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా సిఐ అశోక్ కుమార్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సంక్షిప్తం

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలంటూ ప్రచారం

విశాలాంధ్ర-హెరాళగుంద: హెరాళగుంద ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలంటూ గ్రామాల్లో ప్రచారం చేపట్టినట్లు ప్రిన్సిపాల్ కె ప్రవీణ శుక్రవారం తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు కాలేజీ గురించి చెప్పడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎలాంటి ఫీజులు లేకుండా విద్యార్థులను చేర్పించుకుంటామని అనుభవ జ్ఞులైన అధ్యాపకులతో విద్యార్థులకు విద్యాబోధన కల్పించ డమే కాక ఉచిత దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్త కాలు పంపిణీ చేస్తామని మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు ఆహార సదుపాయం ఉందన్నారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు విద్యాబోధన అందిస్తామని అన్నారు. ఈ సంవత్సరం మొదటి, రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనిపించారని అందుకు అధ్యాపకుల మంచిబోధన విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహకమే కారణమని అన్నారు. మండలంలోని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేర్పించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కాలేజ్ ప్రిన్సిపాల్ విజ్ఞప్తి చేశారు.

పిడుగుపాటుకు ఎద్దు మృత్యువాత

విశాలాంధ్ర - ఆస్పరి: మండల కేంద్రం ఆస్పరిలో మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షంతో పిడుగుపడి ఓ ఎద్దు మృత్యువాత పడింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆస్పరికి చెందిన మెహబూబ్ బాష ఊరు చెరువు సమీపంలోనే వామిదొడ్డిలో రెండు ఎద్లను కట్టివేశాడు. మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఉరుములు, మెరుపులతో పెద్ద శబ్ధంతో ఎద్ల సమీపంలో పిడుగుపడింది. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు అక్కడికక్కడే మృత్యువాతపడింది. దూరంలో ఉన్న మరో ఎద్దుకు తృటిలో ప్రాణ పాయం తప్పింది. కాగా మృత్యువాతపడిన ఎద్దు విలువ రూ.75 వేలు ఉంటుందని రైతు మహబూబ్ బాష తెలిపారు. పేద కుటుంబానికి చెందిన రైతుకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని జడ్పిటిసి దొరబాబు, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మూలింటి రాధమ్మ లు జిల్లా అధికారులను కోరారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-గూడూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలని గూడూరులో ముస్లింలు భారీ ర్యాలీ చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం గూడూరు నగర్ పంచాయతీ వైస్ చైర్మన్ పిఎస్ అస్లాం ఆధ్వర్యంలో చేపట్టిన ముస్లింల ర్యాలీకి ఎమ్మిగనూరు సిపిఐ పట్టణ అధ్యక్షుడు రంగన్న, సిఐటియు డివిజన్ నాయకులు జే మోహన్, ఎమ్మార్పీఎస్ నాయకులు సుభాకర్ మద్దతు తెలిపి కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులకు విరుద్ధంగా ఉన్న వక్ఫ్ సవరణ బిల్లును బేషరతుగా వెనుక తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ తీరులో మార్పు రాకుంటే భారీ ఎత్తున ఉద్యమాలు చేపట్టి వచ్చే ఎన్నికల్లో బిజెపిని గద్దె దింపేందుకు సిద్ధంగా ఉన్నామని ముస్లిం సోదరులు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలకు ప్రజాసంఘాలు మద్దతు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డులు తీసుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరంలో వయో వృద్ధులు ఐడి కార్డులు తీసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 60 ఏళ్ళు పైబడిన పురుషులు, 50 ఏళ్లు పైబడిన మహిళలు సీనియర్ సిటిజన్స్‌గా పరిగణించబడతారని, వారు తమ సచివాలయాల్లో ఐడి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, రూ.40 రుసుము చెల్లిస్తే ఐడి కార్డు మంజూరు అవుతుందని, దీని ద్వారా రవాణా సమయంలో, వివిధ సందర్భాల్లో క్యూలైన్‌లు, ఇతరత్రా సమయాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని, వయో వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీవీ కోరారు.

అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర- చిప్పగిరి: మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయం నందు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆర్‌జె ప్రకాష్ మాదిగ వర్గం పత్తికొండ డివిజన్ కార్యవర్గ సమావేశంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు చిప్పగిరి లక్ష్మీనారాయణ మాదిగ పాల్గొన్నారు. పత్తికొండ డివిజన్ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులుగా పెద్దహెరాతూరు నరసప్ప మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాదిగలకు అట్టడుగు వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని, వారిపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో అండగా నిలబడి పోరాటం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పత్తికొండ డివిజన్ అధ్యక్షులు గూల్యం యల్లప్ప మాదిగ, ఆదోని డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ మాదిగ, మంగన్న, మార్లమడికి రంగన్న పెద్ద ఎత్తున ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ కార్యాలయాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మరియు నూతన, పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషి కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు కార్యాలయాన్ని సందర్శించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి, ఎంపి నాగరాజు ఆహ్వానం మేరకు నగరంలో ఉన్న కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ జోషిని ఎంపి నాగరాజు సన్మానించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు. అనంతరం జిల్లాలోని పలు సమస్యలపై కేంద్ర మంత్రికి ఎంపి నాగరాజు వినతిపత్రం సమర్పించారు.

ఘనంగా శుభ శుక్రవారం వేడుకలు

విశాలాంధ్ర-హెరాళగుంద: మండల కేంద్రంలో క్రైస్తవ సోదరులు శుక్రవారం గుడ్ ఫ్రైడే పండుగను ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవ సోదరులతో చర్చీలన్నీ కిటకిటలాడాయి. గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థన చేశారు. ఫాదర్‌లు క్రైస్తవులు ఉద్దేశించి ప్రసంగిస్తూ యేసు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని ఆయన బాటలో అందరూ నడవాలని క్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి శాంతి సందేశాన్ని ఇస్తుందని అన్నారు. ఏసుక్రీస్తు శిలువను ఎక్కి ప్రాణాలు వదిలి త్యాగ దినమే గుడ్ ఫ్రైడే అని అన్నారు. కొత్త దుస్తులతో క్రైస్తవులు చర్చిల్లో ప్రార్థన చేశారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు ఒకరికొకరు గుడ్ ఫ్రై డే శుభాకాంక్షలు తెలిపారు. చిన్నహ్యాట, గజ్జిహళ్లి, వందవాదలి, హెబ్బటం, ఎండి హళ్లి, ఇంగలదహాల్, తదితర గ్రామా ల్లో క్రైస్తవులు ఫ్రైడే వండుగను ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవ సోదరులు చర్చలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

రెండు బైకులు ఎదురెదురుగా ఢీ

విశాలాంధ్ర సి.బెళగల్: మండల కేంద్రం సమీపంలో ఉన్న కస్తూరిబా పాఠశాల సమీపంలో బ్రాహ్మణ దొడ్డికి చెందిన రామ్ నాయుడు, అశోక్ మద్యం మత్తులో బైకు నడుపుతూ కంబదహాల్‌కు చెందిన తిమ్మప్ప అనే వ్యక్తిని ఢీకొట్టారు. వీరు బెళగల్ నుండి బ్రాహ్మణ దొడ్డి గ్రామానికి పల్సర్ బైకుపై వెళ్తుండగా గూడూరు నుండి కంబదహాల్‌కు యూనికాన్ బైక్‌పై వెళ్తున్న తిమ్మప్ప బైకును ఢీకొట్టిన ఘటనలో ఒకరి తలకు తీవ్రగయాలుకాగా ఇద్దరికి స్వల్ప గాయాలు కావడం జరిగింది. ఈ విషయాన్ని పోలీస్ స్టేషన్కు తెలుపగా ఎఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుల్ సుదర్శనం వెంటనే అక్కడికి చేరుకొని గాయాలు తగిలిన వారిని వైద్యం నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్యం సేవించి అతి వేగంగా వాహనాలు నడవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగు తాయన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 19, ఏప్రిల్ 2025

మాదిగలకు ఉపకులాలకు సముచిత స్థానం

విశాలాంధ్ర– ఆస్పరి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాలనలోని మాదిగలకు మాదిగ ఉపకులాలకు సముచితస్థానం దక్కిందని ఎంఎస్‌పి జిల్లా కార్యదర్శి పెద్ద సంజప్ప మాదిగ, మండల కార్యదర్శి రామాంజనేయులు మాదిగ అన్నారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి చిన్న సంజన మాదిగ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గాల్లో అసమానతలు లేకుండా ఆయా వర్గాల్లో మరింత వెనుకబడిన వారికి న్యాయం చేసేందుకు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని భావించి ఆ దిశగా తొలి అడుగులు వేసిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అన్నారు. మందకృష్ణ మాదిగ నేతృత్వంలో చేపట్టిన మాదిగల ఉద్యమాన్ని ఆదరించి ఎస్సీ వర్గీకరణకు మొట్టమొదట మద్దతు ఇచ్చింది కూడా చంద్రబాబే అన్నారు. 2014–19లో మాదిగలకు అన్యాయం జరగకూడదని భావించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను జనాభా దామాషా ప్రాతిపదికన అందించి వర్గీకరణ స్ఫూర్తిని పరిరక్షించి ఎస్సీ సామాజిక వర్గాలకు ఆది నుంచి టీడీపీ అండగా నిలిచిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాడు దళితుల పట్ల వివక్షను నిర్మూలించేందుకు అప్పటి సీఎంగా చంద్రబాబు జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను నియమించారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మందకృష్ణ మాదిగ నడిపిన మాదిగ దండోరా ఉద్యమానికి అండగా నిలిచిన బిజెపి, సిపిఐ, సిపిఎం పార్టీలతో పాటు ప్రజా ప్రజాసంఘాలు, కులాసంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మహానంది మాదిగ, పరమేష్ మాదిగ, పులి కరుణ మాదిగ, మండల నాయకులు మల్లికార్జున, రంగస్వామి, ఉరుకుంద, శ్రీరాములు, మల్లేశు, రంగన్న, బజారి, శ్రీనివాసులు, దస్తగిరి, తిప్పయ్య మాదిగలు పాల్గొన్నారు.

మే 31న సిద్దేశ్వరం వద్ద ప్రజా బహిరంగ సభ



విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : రాయలసీమ పట్ల నిర్లక్ష్యం, వివక్ష, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల పరాకాష్టకు చేరిన ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రాయలసీమతో సహా నెల్లూరు, ప్రకాశం జిల్లాల వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధి దిశగా మే31న సిద్దేశ్వరం వద్ద ప్రజా బహిరంగ సభను నిర్వహిస్తున్నా మని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రకటించారు. సిద్దేశ్వరం అలుగు ప్రజా శంఖుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా మే 31న సిద్దేశ్వరంలో జరిగే ప్రజా బహిరంగ సభకు సంబంధించి శుక్రవారం సమితి ప్రతినిధులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సిద్దేశ్వర ఉద్యమానంతరం సిద్దేశ్వరం అలుగు నిర్మాణం పట్ల సానుకూల సందేశాలిస్తూ గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల పథకం, ఆర్డీఎస్ కుడి కాలువ తదితర నిర్మాణాలకు శంకుస్థాపన, హంద్రీనీవా ప్రధాన కాల వెడల్పు తదితర కార్యక్రమాలకు పాలకులు పాలనపరమైన అనుమతులు ఇచ్చారన్నారు. ఈ పనులలో పురోగతి లేకపోగ, తెగిపోయిన అలగ నూరు, అన్నమయ్య ప్రాజెక్టులకు ప్రతిపాదనలతోనే కాలం వెళ్లబుచ్చుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. తెగిపోవడా నికి సిద్ధంగా ఉన్న గోరుకల్లు రిజర్వాయర్ వల్ల మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు కలిగే ఇబ్బందులను అసెంబ్లీలో ప్రభుత్వం అంగీకరిస్తోంది గానీ బడ్జెట్లో నిధులు కేటాయించ డానికి సిద్ధపడకపోవడం సిగ్గుచేటన్నారు. పాలకుల నిరంకుశ వైఖరికి నిరసనగా మే 31న సిద్దేశ్వరం దగ్గర నిర్వహించే ప్రజా బహిరంగ సభ విజయవంతంలో భాగంగా ప్రతి పల్లె, గడపకు వెళ్ళి రాయలసీమ పట్ల ప్రభుత్వ వైఖరిని ప్రజలలోకి తీసుకెళ్ళి ప్రభుత్వ తీరును ఎండగడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వైఎన్ రెడ్డి, సామాజిక విశ్లేషకులు గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, రైతు నాయకులు చెరుకూరి వెంకటేశ్వర నాయుడు, ఉప్పలపాటి బాలీశ్వరరెడ్డి, కొమ్మా శ్రీహరి, కొండారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, ఈశ్వరరెడ్డి, మహబూబ్ బాషతో పాటు వివిధ మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

పంట అవశేషాల నిర్వహణపై అవగాహన

విశాలాంధ్ర –గోనెగండ్ల: పంట అవశేషాల నిర్వహణపై అవగాహన ఏడిఏ ముహమ్మద్ ఖాద్రీ రైతులకు పత్రిక ప్రకటన ద్వారా కల్పించారు. ఈ సందర్భంగా ఏడిఏ ముహమ్మద్ ఖాద్రీ మాట్లాడుతూ పంటల సాగు పూర్తి అయిన తర్వాత, పంట అవశేషాలను కాల్చడం, అనేది ప్రధానసమస్య అన్నారు. ఇదిపర్యావరణ, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, ఇది వాయు కాలుష్యం గణనీయంగా పెంచుతుందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల గాలిలో కాలుష్య కణాలు విడుదల అవుతాయని తెలిపారు. అవశేషాలు కాల్చడం వలన నేల పోషకాలు నష్టపోతాయి.తద్వారా భూసారం తగ్గుతుందన్నారు. గాలి కాలుష్య కణాలు ప్రజల ఆరోగ్యానికి హానికరమైనవని, శ్వాసకోశ సమస్యలు, చర్మ వ్యాధులు మరియు ఇతర ఆరోగ్య సమస్యలకు కారణం కావొచ్చన్నారు. పంట అవశేషాలు కాల్చడం వల్ల గ్రీన్ హౌస్ వాయువులు విడుదల అవుతాయి. ఇవి వాతావరణ మార్పులకు దోహదపడుతాయన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

విశాలాంధ్ర – ప్యాపిలి: పట్టణంలో శుక్రవారం సీయోన చర్చి నందు క్రైస్తవ సోదరులు ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సుందరం బైబిల్ ప్రసంగంలో ఉన్న వాక్యాలను చదివి క్రైస్తవ సోదరులకు వినిపించారు. క్రైస్తవ సోదరులు ఏసు మమ్ములను కాపాడు అంటూ ప్రత్యేక ప్రార్థనలను కార్యక్రమానికి క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

విశాలాంధ్ర – కోవెలకుంట్ల: పట్టణంతో పాటు వివిధ గ్రామాలలో క్రైస్తవ సోదరులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని సౌదరదిన్నె, ఆమడాల, గుల్లదుర్తి, పెద్ద కుప్పెర్ల, వల్లంపాడు, గుంజలపాడు, బిజినవేముల తదితర గ్రామాలలో గుడ్ ఫ్రైడే వేడుకలు క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రోజున క్రైస్తవులు శిలువను మోస్తూ పురవీధుల గుండా తిరిగి చర్చికి వెళ్లి చర్చిలో ఏసుక్రీస్తు సిలువ మాను పై పలికిన సందేశాలను క్రైస్తవులు ప్రజలకు వినిపించారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

విశాలాంధ్ర – మిడుతూరు: మండల పరిధిలోని గ్రామాలలో సిఎస్ఐ, ఏబీఎం, ఆర్‌సిఎం చర్చిల నందు క్రైస్తవ సోదరులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పలదడియ విచారణ ఆర్ సి ఎం చర్చి నందు ఫాదర్ మధుబాబు ఆధ్వర్యంలో 10 గ్రామాల క్రైస్తవ సోదరులతో కలిసి దిగివపాడు కల్వరి కొండ వద్దకు ఫాదర్ మధుబాబు సిలువ మూసుకుంటూ 14 స్థలాలు పాటలు, జపాలు చదువుతూ సిలువ యాత్ర చేశారు. అనంతరం కల్వరికొండ వద్ద బైబిల్‌లో ఉన్న ఉపదేశాన్ని వినిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 10 గ్రామాల ఉపదేషులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

మధార్‌వలి దర్గాలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర – శిరివెళ్ల: మండల పరిధిలోని బోయలకుంట్ల గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మద్దగారి కరీం కుమారుల కేశఖండన మహోత్సవ కార్యక్రమానికి మండల టిడిపి కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. నందిపల్లె గ్రామంలో గల మదార్ వలి దర్గా సన్నిధి యందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మద్దగారి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు కేశఖండన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అల్లా ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని చిన్నారులను ఆశీర్వదించారు. శ్రీకాంత్ రెడ్డి వెంట పలువురు టిడిపి నేతలు ప్రముఖులు బోయలకుంట్ల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

విశాలాంధ్ర – చాగలమర్రి : మండలం లోని శెట్టివీడు గ్రామ సమీపంలో అహోభిళంకు వెళ్ళే రహదారిలో విశ్రాంత ఎస్ఐ నర్సయ్య దంపతుల సహకారంతో శ్రీ అభయ ఆంజనేయ స్వామీ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు నరసింహ ప్రసాద్ శాస్త్రి, ప్రతాప్‌శర్మ మంత్రోచ్చారణ నడుమ, అభినవ శంకరానంద స్వామి ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి, గణపతి, నంది విగ్రహ ప్రతిష్ట మహోత్సవం, పూర్ణాహుతి, కలశపూజ, నవగ్రహపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం చేసారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, గుత్తి నరసింహులు, సల్లా నాగరాజు, కొండారెడ్డి, శంకరాచారి, సురేంద్ర, పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ఇద్దరు అరెస్టు

విశాలాంధ్ర – పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబళదిన్నె గ్రామ శివారుల్లోని మారెమ్మ అవ్వ గుడి సమీపంలో ఎన్నోవ కారులో కర్నాటక మద్యం తరలి వెళుతున్నట్లు అందిన సమాచారం మేరకు కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తన పోలీసు సిబ్బందితో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఎన్నోవా కారు తరలిస్తున్న 40 బాక్సుల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన ముగ్గురు, కంబళదిన్నె గ్రామానికి ఒకరు నిందితులుగా ఉన్నట్లు ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి స్పష్టం చేశారు. ఇద్దరు నిందితులు పరారీ అయ్యారని, రచ్చుమర్రికి చెందిన శివశంకర్, కంబళదిన్నెకు చెందిన బోయ ఉసేనిలను అరెస్టు చేసి వారి నుండి 40 బాక్సుల కర్నాటక మద్యాన్ని, ఎన్నోవా కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ వెల్లడించారు.

విజయవంతంగా ముగిసిన ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర – ఆదోని రూరల్: జంగమ అర్చక సమాఖ్య, శ్రీ అల్కూరి మఠం మహర్షి సిద్ధయ్య స్వామి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి అల్కూరి మఠం మహర్షి గిరిజవాణి నేతృత్వంలో శుక్రవారం శ్రీమల్లికార్జున ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరనికి మంచి స్పందనతో విజయవంతంగా ముగిసింది. ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు జాగ్రత్తలతో జంగమ అర్చక సమాఖ్య డివిజన్ అధ్యక్షుడు అల్కూరి మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు. ఉచిత వైద్య శిబిరానికి కర్నూలు కిమ్స్ హాస్పటల్ నుంచి గుండె, ఈఎన్టి ముగ్గురు నిపుణులతో పాటు బిపి, శుగర్ ల్యాబ్ టెక్నీషియన్లు, ఆదోని పట్టణంలో ఉన్న డెంటల్ వైద్య నిపుణులు రవికిరణ్, వినయ్, ఫిజీషియన్ నిపుణులు రాహుల్, ఆర్థోపెడిక్ నిపుణులు ఉష వంటి అనుభవజ్ఞులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడాన్ని రోగులు హర్షం వ్యక్తం చేశారు. ఆదోని చుట్టుపక్కల ప్రాంతాల రోగులతో పాటు ఎమ్మిగనూరు, ఆలూరు, ఆస్పరి, పెద్దకడబూరు వంటి వివిధ మండలాల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రోగులు తరలివచ్చి, దాదాపు 161 మంది రోగులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు రుచికరమైన అన్నదాన కార్యక్రమాన్ని మహర్షి విజయ్ కుమార్ స్వామి నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్లికార్జున పాఠశాల కరస్పాండెంట్ సుగూరప్ప పాల్గొన్నారు.

వైసీపీవి చిల్లర రాజకియాలు

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలపై మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపణలు వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం అహోబిలం క్షేత్రంలోని మఠంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విలేకరుల సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ఐదేళ్ళ పాలనలో రాష్ట్రంలో దేవాలయాలకు, దేవుళ్ళకు, దేవుని భూములకు, దేవుని రథంలకు రక్షణ లేదని ఎంపీ బైరెడ్డి శబరి వివరించారు. టీటీడి చైర్మన్‌గా భూమన పనిచేసిన కాలంలో అనేక అక్రమాలు జరిగాయన్న ఆరోపణలకు ముందు భూమన సమాధానం చెప్పాలని ఎంపీ శబరి డిమాండ్ చేశారు. గోశాల గురించి మాజీ మంత్రి ఆర్‌కె రోజా తిరుపతిలో చేసిన హడావిడిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుమారుడు చిన్న పిల్లాడు అని చూడకుండా ఆర్‌కె రోజా మాట్లాడడం ఆమె దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని, వైసీపీ కొత్త బతుకు జట్కా చిత్రం కోసం నటులను ఎతుక్కున్నట్లు ఉందని, మహిళగా రోజా ఆలా మాట్లాడడం మంచిది కాదన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలోని ఉమ్మడి ప్రభుత్వం ప్రజల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం మాత్రమే పని చేస్తుందని, వైసీపీ ఆరోపణలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. అహోబిల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వార్లను దర్శించుకున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం నల్లమల అరణ్యంలో వెలసిన అహోబిలం నవ నరసింహ క్షేత్రాన్ని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ ఎంపీ బైరెడ్డి శబరి సందర్శించి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వార్లను దర్శనం చేసుకున్నారు. ఆలయం ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, అర్చకులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి అమ్మ వార్లకు విశేష పూజలు చేయించారు. అనంతరం ఆలయ మండపంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ని అర్చకులు వేదాశీర్వాదంతో దీవించి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి చిత్ర పటం, తీర్థ ప్రసాదం అందించి సత్కరించారు. ఈ పూజల్లో కర్నూల్ ఉమ్మడి జిల్లా టిడిపి మాజీ ఉపాధ్యక్షుడు గూడూరు సంజీవరాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, నంద్యాల ఎంపీ ఆఫీస్ ఇంచార్జి నరహరి విశ్వనాథ్ రెడ్డి, పుల్లయ్య చౌదరి పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా టీడీపీ

విశాలాంధ్ర – పెద్దకడబూరు : సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్త కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం పెద్దకడబూరులోని ఆయన స్వగృహం నందు టీడీపీ కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరవ రమాకాంతరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే కోటి మంది సభ్యత్వం ఉన్న ఏకైక ప్రాంతీయ పార్టీ టీడీపీ అని తెలిపారు. టీడీపీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు రూ. 5 లక్షలు భీమా వర్తిస్తుందని తెలిపారు. టీడీపీ బలోపేతానికి సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున, మీ సేవ ఆంజనేయులు, తలారి అంజీ, గోనుమాను నరసన్న, కలుగొట్ల లక్ష్మన్న, బొగ్గుల నరసన్న, రాగిమాన్ దొడ్డి వెంకటరెడ్డి, రాముడు, రంగాపురం మహదేవ, సుధాకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రామరాజ్యమా.. రాక్షస రాజ్యమా..

విశాలాంధ్ర – కౌతాళం: దేశంలో రామరాజ్యం పాలన కాదని రాక్షస రాజ్యం పాలన సాగుతుందని ప్రజాసంఘాలు సీపీఐ, సీపీఐ(ఎం), అవాజ్ కమిటీ, దళిత సమాఖ్య జై భీమ్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మదీనా మజీద్ నుండి దర్గా మీదుగా పాత బస్టాండ్ ద్వారా ప్రధాన రహదారి గుండా బిస్మిల్లా సర్కిల్ వద్ద చేరుకొని మానవహారాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగా అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేవలం మత చిచ్చు పెట్టడానికి, హిందూ ముస్లిం మధ్య వైరుధ్యం పెంచడానికి ముస్లిం వ్యతిరేక చట్టాలను తీసుకువస్తుందని విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సవరణ చట్టానికి మద్దతు తెలపడం ఆయన వెన్నుపోటుకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా ధర్మాకర్త మున్న సాహెబ్, సర్పంచ్ పాల్ దినాకర్, సిపిఐ మండల కార్యదర్శి ఈరన్న, సిపిఎం డివిజన్ ఉపాధ్యక్షులు మల్లయ్య, జై భీమ్ నాయకులు అవతారం, వీరేష్, దళిత సమాఖ్య మండల అధ్యక్షులు విజయకుమార్, ముస్లిం పెద్దలు ఖాజా హుస్సేన్, ముల్లా గౌస్ పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవికి పల్లకి సేవ

విశాలాంధ్ర –బనగానపల్లె: మండల పరిధిలోని నందవరం దేవస్థానం నందు శుక్రవారం సందర్భముగా చౌడేశ్వరి దేవికి పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమము నందు మాజీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది రామ్మోహన్, మణికంఠ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొనడం జరిగినది.

డాన్సర్స్‌ను అభినందించిన జూనియర్ ఎన్టీఆర్

విశాలాంధ్ర – బేతంచెర్ల : బేతంచెర్లకు చెందిన డిజె మధు బృందం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొని ప్రతిభ కనబరచడంతో ఆ బృందాన్ని ప్రముఖ సినీ హీరోలు జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్, ప్రముఖ సినీ హీరోయిన్ విజయశాంతిలు అభినందించారు. డాన్స్ మాస్టర్లు మణికంఠ, మధు, కృష్ణ, అసిస్టెంట్ మాస్టర్ ఇద్రూస్‌తో పాటుగా 25 మంది డాన్స్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డులతో కార్యకర్తలకు రక్షణ

విశాలాంధ్ర – బనగానపల్లె : టిడిపి సభ్యత్వం కార్డులతో కార్యకర్తలకు అన్ని విధాలుగా రక్షణ ఉంటుందని టిడిపి నాయకులు జంపని శేషా రెడ్డి, రంగస్వామి రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో టిడిపి సభ్యత్వం కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యత్వం కలిగిన కార్యకర్త ప్రమాదంలో మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల బీమా లభిస్తుందని తెలిపారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

విశాలాంధ్ర – జూపాడు బంగ్లా: మండలంలోని వివిధ గ్రామాలలో క్రైస్తవ సోదరులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడు కలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పారుమంచాల, తరిగోపుల, మల్లెం,తుడిచెర్ల తంగడంచ, బన్నూరు, జూపాడు బంగ్లా, లింగాపురం, పోతులపాడు తదితర గ్రామాలలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్లు క్రైస్తవులను ఉద్దేశించి ఏసుప్రభు గురించి ప్రబోధించారు. ఏసుక్రీస్తు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని ప్రతి ఒక్కరూ ఆయన బాటలో అందరూ నడవాలన్నారు. క్రీస్తు బోధనల గురించి క్రైస్తవ భక్తులకు సందేశం అందించారు. ఉదయం నుంచి చర్చిలలో ప్రార్థనలతో గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

వడ్డెమానులో శుభ శుక్రవార వేడుకలు

విశాలాంధ్ర – నందికొట్కూరు: పాపులను ద్వేషించకు పాపాలను ద్వేషించు అన్న ప్రేమ మూర్తి దైవ కుమారుడు ఏసుక్రీస్తు కు కల్వరిగిరి పై సిలువ వేసిన దినమే శుభ శుక్రవారం అని కర్నూలు సీఎస్ఐ చర్చి సిస్టర్‌లు రాజకుమారి, సౌభాగమ్మ ప్రసంగించారు. శుక్రవారం మండల పరిధిలోని వడ్డెమాన్ గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సంఘ పెద్దలు యాట ప్రభాకర్, సగినేల జయపాల్, రాజ గారి స్వాములు, సంఘ కాపరి యాకోబు సంఘస్తులు సగినేల సుబ్బన్న, సగినేల తిరుపాల్, యవనస్తులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై గ్రామస్తులకు అవగాహన

విశాలాంధ్ర – పాములపాడు: మండలంలోని జూటూర్ గ్రామంలో గ్రామసభ నిర్వహించడమైనది. ముందుగా గ్రామంలో పోలీస్ సిబ్బందిపై కవాతు నిర్వహించి అనంతరం గ్రామసభలో డిఎస్‌పి రామాంజి నాయక్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై పంచసూత్రాలు అయిన 1. హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, 2. సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని, 3. మద్యం త్రాగి వాహనము నడపరాదని, 4. సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, 5. ఓవర్ లోడ్ ఆటోలలో ప్రయాణం చేయరాదని, తెలియజేయడం జరిగినది. మీరు నడుపు వాహనములకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, నడిపే వ్యక్తికి ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఆన్లైన్ గేమ్స్, ఆన్లైన్ లోన్స్, ఆప్స్,ల గురించి, ఆన్లైన్ ట్రాన్సక్షన్స్, ఆన్లైన్ లో ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే నమ్మవద్దని తెలిసినవారు. ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామంటే నమ్మవద్దని, స్వయంకృషిని నమ్ముకోవాలని తెలియజేయడం జరిగింది. మహిళలపై జరిగే నేరాలు గురించి, బాల్య వివాహాలు గురించి వివరించడం జరిగింది. దొంగతనాలు, చైన్ స్నాచింగ్లు జరుగుతున్నాయని, విలువైన ఆభరణములు, వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండవలెనని, ఒంటరిగా వెళ్లకూడదని,రైతులు పంట పొలాలకు మందులు కొట్టేటప్పుడు తప్పనిసరిగా నోటికి గుడ్డ కట్టుకోవాలని లేదా మాస్క్ వేసుకోవాలని తెలిపారు. లేనట్లయితే ఆ మందు పిచికారి చేసేటప్పుడు గాలిపీల్చి అస్వస్థకు గురవుతారని, ఇటీవల కాలంలో కొన్ని కుటుంబ కలహాలతో, అప్పులు అని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని కనుక ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకోకూడదనీ మీకు ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించుకోవాలని తెలియజేయడం జరిగినది. ఇటీవల కాలంలో సెల్ ఫోన్ వినియోగం ఎక్కువైందని, తల్లిదండ్రులు పిల్లలు పట్ల జాగ్రత్తగా ఉండాలనీ, ఎండాకాలం సెలవులైనందున పిల్లలు ఈతకు కెనాల్, బావుల వద్దకు వెళుతున్నారని, పిల్లలు ఎక్కడకు వెళుతున్నారు అనేది గమనించాలని, ఎక్కడకు వెళ్లినా తల్లిదండ్రులకు చెప్పాలని పిల్లలకు తెలియజేయాలని తెలిపారు.